# నరమేధం జరుగుతోంది

విశాలమయిన ఆ గదిలో, ట్యూబు లైటు కాంతి తెల్లగా పరుచుకుని ఉంది. ఆ కాంతి వెన్నెలంత చల్లగా లేక పోయినా, వెలుగంత వేడిగా కూడా లేదు. శబ్దం చెయ్యకుండా తిరుగుతున్న సీలింగు ఫేను, గది వాతావరణాన్ని ఆహ్లాదకరంగా మారుస్తోంది. మెత్తని సోఫా మీద ఓ మూల ముద్దుగా ముడుచుకుని కూర్చుంది రోజీ. తెల్లని బొచ్చుతో కప్పబడి పోయి, మిల మిల మెరిసే గాజు కళ్ళతో - మీగడ ముద్దలా ఉందది. ఆ చల్లటి వాతావరణంలో -

పుస్తకాలతో కుస్తీ పడుతున్నాడు కృష్ణ. వాడికి అసహనంగా ఉంది. పరీక్షలు బాగా దగ్గరి కొచ్చేసాయి. వాడిలో ఆందోళన వాడిని నిశ్చింతగా ఉండ నివ్వడం లేదు. టెర్రర్. టెర్రర్. పరీక్షలంటే భయం. పరీక్ష చదువంటే గుండె దడ. నిజానికి వాడేం తెలివి తక్కువ వాడు కాదు. చదువులో చురుకు, తెలివి తేటలు ఉన్న వాడే. అయినా, పరీక్షలంటే భయం. వాడంతగా భయ పడడానికి కారణం లేక పోలేదు. వాడి భయం అంతా - రానున్న పబ్లిక్ పరీక్షలో తన మొదటి రాంకు నిలుపుకోగలడా లేదా అనే! స్కూల్లో తనతో పోటీ రాగలిగే వాళ్ళు యిద్దరో, ముగ్గురో! అంతే. ఒకడు మాధవ - ఫారెస్టు రేంజరు గారి అబ్బాయి. రెండో వాడు మోహన్. అమ్మాయిల్లో సుధా రాణి - అవధాని గారి అమ్మాయి.

ఎలాగయినా సరే - వాళ్ళందరినీ అధిగమించి తీరాలి. ఈ పరీక్షల్లో తనకే మొదటి స్థానం లభించాలి. ఎందుకంటే -

డాడీ చెప్పారు - తన జీవితంలో యీ పరీక్ష చాలా ముఖ్యమైనదని. ఇదే మంచి 'టర్నింగ్ పాయింట్' అని. "కిషన్... పరీక్షలకు బాగా చదవాలి సుమీ! ఏ మాత్రం అశ్రద్ధ చేసినా, నీ భవిష్యత్తుని నువ్వే చేతులారా నాశనం చేసుకున్న వాడి వవుతావు. గర్తుంచుకో. అవకాశాలు మనని వెతుక్కుంటూ రావురా. మనమే అవకాశాల్ని వెతుక్కుంటూ వెళ్ళాలి. స్కూల్లో డర్టీ గేంగ్ చాలా ఉంటుంది. వాళ్ళతో చేరితే, నీ పని అంతే. ఈ పబ్లిక్ పరీక్షల్లో నువ్వు మంచి మార్కులు సంపాదించు కుంటేనే నీకు బంగారం లాంటి భవిష్యత్తు ఉంటుంది. ఇంజనీరింగు చదువుదువు గాని ... ఆ తర్వాత ..."

అవును. ఆ తరువాత... ఆ తరువాత... డాడీ తన కోసం, బంగారు భవిష్యత్తుని సిద్ధం చేస్తున్నారు. అసలా తరువాత తన జీవితమే మారి పోతుంది. మోహన్, మాధవ, సునీల్... వీళ్ళెవరూ కనీసం కలలో కూడా ఊహించ లేని అద్భుతమైన స్థాయిని తను

పొందే అవకాశం ఉంది... కృష్ణ మనసు అందమయిన ఆలోచనలతో ఉక్కిరి బిక్కిరవుతోంది. స్కూల్లో – ఆ రోజు లంచ్ అవర్లో కేరియర్లు విప్పి, భోజనాలు చేస్తుండగా తన స్నేహితుల మధ్య వచ్చిన సంభాషణ గుర్తొచ్చింది వాడికి. ముందు ముందు చదువుల గురించి వాళ్ళ కలలు కలబోసుకున్నారప్పుడు.

మాధవ ఎమ్మెస్సీ చదివి, డాక్టరేట్ చేస్తాట్ట. మోహన్ ఇంజనీరవు తాడుట. సునీల్‌కి లెక్చరర్ అవాలనుందిట. తనేం మాట్లాడ లేదు. చెప్ప దల్చు కో లేదు. "కృష్ణ మాట్లాడడేం?" అడిగేడు మాధవ.

తన మనసులో ఊహలు – డాడీ చెప్పిన విషయాలూ వాళ్ళకి చెప్తే, వాళ్ళు నమ్మక పోవచ్చు. పైపెచ్చు వేళాకోళం కూడా చెయ్యొచ్చు. "ఒరే కృష్ణా! గాలిలో మేడలు లేపొద్దురా!... టెక్నికల్ కలర్ కలలు కంటూ కూచోకు...జారి పడ గలవ్..." అని, ఆటలు పట్టించ వచ్చు. కాని, వాళ్ళకేం తెలుసు? తన ఆశలు నెరవేరే రోజు వస్తుందనీ, కళ్ళు మిరిమిట్లు గొలిపే బంగారు కాలం తన ముందున్నదని! తన ఆలోచనలేవీ వాళ్ళకి తెలియ నివ్వకూడదు. డాడీకి తనిచ్చిన మాట నిలబెట్టు కోవాలి. పరీక్షల్లో తను సంపాదించిన మార్కులు చూసి, డాడీ సంతోషంతో పొంగి పోవాలి. అలా జరగాలంటే... తను బాగా చదవాలి!

కాని ...

కానీ – ఈ రోజు మధుసూదన్ చెప్పిన విషయం విన్న దగ్గర నుంచీ తన మనసు మనసులో లేదు. వాడు చెప్పినదంతా నిజమా! అసలలా జరుగుతుందా! ఏమో! ఎందుకు జరుగ కూడదు? మధుసూదన్ ఎంత నమ్మకంగా చెప్పేడు! ఆ ఆలోచనలు రాగానే, కృష్ణ ఒంటి మీద చిరు చెమటలు పోసేయి. వాడి గుండె రెట్టింపు వేగంతో కొట్టు కోవడం ప్రారంభించింది. శరీరంలో సన్నని వణుకు మొదలయింది. వాడి కేవో తెలీని లోకాలు తెరుచు కున్నట్టుగా ఉంది. వాడికి తన ఊపిరి తనకే వెచ్చగా తగులు తోంది. కృష్ణ చూపు పుస్తకం మీద నిలబడడం లేదు. అక్షరాలు అలుక్కు పోయి కనిపిస్తున్నాయి. సాయంత్రం మధుసూదన్ ఏదో ట్రిగ్నామెటరీ ప్రాబ్లెమ్ సాల్వ్ చెయ్యమంటూ తన దగ్గరకొచ్చేడు. అప్పుడు తను శ్రద్ధగా చదువు కుంటున్నాడు. మధుసూదన్ తన క్లాసు మేటే కానీ, తనూ వాడూ వొక సెక్షను కాదు. వాడెవరో పెద్ద కాంట్రాక్టరు గారి కొడుకు. కృష్ణ వాడు తెచ్చిన లెక్కని చేసి, వివరించి చెప్పేడు. ఆ తరువాత వాళ్ళు చదువు గురించీ, స్కూలు గురించీ, మేష్టర్ల గురించీ చాలా సేపు కబుర్లు చెప్పుకున్నారు.

అప్పటికి చీకటి పడుతోంది.

మధుసూదన్ పుస్తకాలు పట్టుకుని, "వెళ్తారా కృష్ణా!" అని చెప్పి, బయలు దేరాడు. కృష్ణ అతని వెనుకే గుమ్మం వరకూ వచ్చేడు. మధుసూదన్‌కి 'టా టా' చెప్తూ, "అన్నట్టు – నువ్వొక్కడివే చదువుతున్నావా, ఎవరితో నయినా కంబైండ్ స్టడీ చేస్తున్నావా!" అనడిగేడు కృష్ణ. మధుసూదన్ ఆగి పోయేడు. "లేదు కృష్ణా! ఒక్కడ్నే చదువుతున్నాను. మరెవరి తోనయినా కలిసి చదువుకోడానికి మా నాన్న ఒప్పుకోరు." "అదేం!" "దానికి కారణం

ఉందిలే..." నసిగేడు మధుసూదన్. కృష్ణ వాడి వేపు ఆశ్చర్యంగా చూసేడు. మధుసూదన్ ఒక్క క్షణం ఏం మాట్లాడ లేదు. తర్వాత మళ్ళీ ఏం అనుకున్నాడో – "నీకో రహస్యం చెప్తాను...డెడ్ సీక్రెట్... ఎవరి తోనూ చెప్పనని ప్రామిస్ చెయ్యి..." అన్నాడు. "ప్రామిస్..." కృష్ణ కిదంతా వింతగా ఉంది. "గాడ్ ప్రామిస్?" "ఊ..." కుతూహలంగా తలూపేడు కృష్ణ. "అయితే పద... ఇక్కడొద్దు..." అంటూ, మధుసూదన్ గేటు పక్క పున్నాగ చెట్టు కిందకి దారి తీసాడు. కృష్ణ యాంత్రికంగా వాడిని అనుసరించేడు. అప్పటికి అక్కడ చీకటి బాగా ముసురుకుంది. ఒకరి కొకరు మసక మసగ్గా కనిపిస్తున్నారు. అంతా నిశ్శబ్దంగా ఉంది. ఆకులు గల గలలాడే చప్పుడు తప్ప, మరేం వినిపించడం లేదు.

చెట్టు కింద యిద్దరూ దగ్గర దగ్గరగా చతికిల పడ్డారు. ఓ నిమిషం ఆగి, బెదురు బెదురుగా చుట్టూ చూస్తూ – గొంతు బాగా తగ్గించి, రహస్యం చెప్తున్న వాడిలా అసలు విషయం బయట పెట్టేడు మధుసూదన్. "కృష్ణా, నేను చెప్పేది చాలా రహస్యంగా నీ మనసు లోనే వుంచు కోవాలి! ఎవరితో నయినా అన్నావో – కొంపలంటుకు పోతాయ్..." వాడి ఉపోద్ఘాతం కృష్ణలో అలజడిని మరింత రెచ్చగొట్టింది. ప్రపంచ ప్రళయం వస్తోందని, ఒక్క నిమిషం ముందు తెలిసిన వాడిలా అయి పోతున్నాడు. "చెప్పు..." అన్నాడు పీల గొంతుకతో. "మన పబ్లిక్ పరీక్షల పేపర్లన్నీ బయటకి పొక్కేయిటరా! మొత్తం పరీక్షల పేపర్లన్నీ కలిపి, సెట్టుకి రెండు వేల రూపాయల చొప్పున అమ్ముతున్నారుట. అందరికీ కాదనుకో! చాలా సీక్రెట్‌గా అతి కొద్ది మందికి మాత్రమేనట!... మా డాడీకి తెలిసిన ఒకాయన నా కోసం ఒక సెట్టు పేపర్లు సంపాదించి పెడతానన్నాడు. – మా డాడీ అప్పుడే డబ్బులు కూడా యిచ్చేసారు తెలుసా!..."

కృష్ణకి కాళ్ళ కింద భూమి కదిలి నట్టయింది.

దెయ్యం వచ్చి తనతో ముఖా ముఖీ మాట్లాడుతున్నట్లుంది. గుండె కాస్సేపు ఆగి, తిరిగి కొట్టు కోడం మొదలెట్టినట్టుంది. కాళ్ళు చేతులు చచ్చుబడి పోయి, మెదడు మొద్దు బారి పోయినట్లయింది. తెలీని భయమేదో వాడిని ఆవహించింది. ఒళ్ళంతా చెమట్లు పట్టింది. వాడి శరీరం జలదరించుకు పోతోంది. వాడిలో బలహీనపు పేగేదో 'జివ్వు' మంటూ పీకసాగింది.

"మధూ..నాకు...నాక్కూడా అలాంటి పేపర్ల సెట్ ఒకటి సంపాదించ గలవా!..." అడిగేడు తడ బడుతూ. మధుసూదన్ తుళ్ళి పడ్డాడు. ఆ మాట కృష్ణ నోటి నుండి వస్తుందనుకో లేదు. మనసులో ఉబలాటం ఆపుకో లేక చెప్పాడే కానీ, ఆ మరు క్షణం నుంచీ వాడికి, ఎందుకు చెప్పానా అని కంపరమెత్తి పోతోంది. కృష్ణ వాడి వేపు దేబిరిస్తూ బేలగా చూస్తున్నాడు. మధుసూదన్ కాసేపు తటపటాయించేడు. తరవాత అన్నాడు: "మీ డాడీ ఏం అంటారో కృష్ణా! మీ డాడీతో చెప్పి చూడు... అతనే మా నాన్నని కలిసి మాట్లాడితే బాగుంటుంది. మీ డాడీ ఒప్పుకుని ఓ రెండు వేలు ఇస్తే నీక్కూడా పేపర్లు వొస్తాయి... ముష్టి రెండు వేలు పోతేనేం! కానీ... కానీ.. ఈ రహస్యం జాగ్రత్త సుమీ!... గాడ్ ప్రామిస్ అన్నావు గుర్తుంచుకో... తరవాత నీ యిష్టం..." మరీ మరీ హెచ్చరిస్తూ,

మధుసూదన్ వెళ్ళి పోయేడు. వాడు చెప్పిన విషయం అంటుడు పురుగులా కృష్ణ మెదడు తినెయ్యడం మొదలెట్టింది.

డబ్బు పోతేనేం! పరీక్ష పేపర్లు ముందుగా తెలిసి పోతే – ఆ ప్రశ్నలే ప్రిపేరయి వెళ్తే... నిశ్చయంగా తనకి ఫస్టు రాంకు వచ్చి తీరుతుంది.

తన కలలు...తన ఆశలు...నెరవేరాలంటే ఇంత కంటే సుళువయిన మార్గం లేదు! పుస్తకాలన్నీ ఆమూలాగ్రం చదివి పిచ్చెత్తి పోయినా – పరీక్షల్లో ఏం ప్రశ్నలొస్తాయో! ఎలా ఆన్సరు చెయ్య గలడో – సందేహమే! అలాంటప్పుడు మధుసూదన్ చూపిన దారి ఎంత సుఖమయినదో! కాని, అది నీచం కాదూ? అవునేమో – కాదేమో – అవును కాదేమో... అవును కాదు అవునేమో... కాదవును కా....

కృష్ణ తలలో శతఘ్నులు పేలుతున్నట్టుగా వుంది. 'అబ్బా!' అంటూ బాధగా కళ్ళు మూసుకున్నాడు. బయట చీకటి చిక్కబడింది.

## 2

డాక్టర్ రాఘవ కుర్చీలో నిస్త్రాణగా కూలబడి, సిగరెట్ వెలిగించు కున్నాడు. పేషెంట్లెవరూ లేరు. చివరగా వచ్చిన ఒకరిద్దరిని పరీక్ష చేసి, మందులు రాసి పంపించేసాడు. అతని చేతినున్న వాచీ పదీ యిరవై నిమిషాలు చూపిస్తోంది.

సిగరెట్ నాలుగు దమ్ములు పీల్చి, ఏష్ ట్రేలో పడేసాడు. డ్రాయరు సొరుగు లాగి, ఉదయం పోష్టులో వచ్చిన కవరు తీసాడు. అది ఇంగ్లీషులో టైప్ చేసిన ఉత్తరం. దాన్ని చదవటం అప్పటికి ఇది పదో సారి కాబోలు! చదువుకుని తృప్తిగా నిట్టూర్చాడు. అతని కెంతో రిలీఫ్‌గా వుంది. గత కొన్ని నెలలుగా తన మస్తిష్కాన్ని వేడెక్కించిన ఆ 'టెన్షన్' తగ్గి నట్లయింది. తన శరీరంలో అణువణువూ ఏ బలీయమైన కోరిక తీర్చు కోవడం కోసం తపించి పోతున్నాయో– ఆ కోరిక తీరే మంచి రోజు – త్వరలో వస్తోంది! రాఘవ పెదిమెల మీద తృప్తిగా చిరు నవ్వొకటి మెరిసింది. తన కలలు వాస్తవ మయ్యే రోజు...

తను ఆశించే ఉన్నత శిఖరాలు అందుకునే రోజు... తన విజ్ఞానానికి, బుద్ధి కుశలతకీ, తన ఆలోచనలకీ, ప్రణాళికలకూ – ఒక సుందరమైన రూప కల్పన జరుగ బోతోంది. ప్రభుదాసు ఎంత మంచి మనిషి!

ఇంజినీర్ ప్రభుదాస్ సహకారమే లేక పోతే యీ ప్రయత్నాలు అసలింత దూరం వచ్చేవి కావేమో! ప్రభు – గౌతమ్‌ని పరిచయం చెయ్యక పోతే – అలా జరిగి వుండక పోతే – తనూ, తన క్లినిక్కూ, ఈ దౌర్భాగ్యపు రోగులూ... ఈ ఆకలి మనుషుల నంగి నటనలూ, ఫీజు ఎగ్గొట్టడం కోసం వాళ్ళ బీద అరుపులూ, జాలి కథలూ... ఇవి తప్పే రోజులు తన జీవితంలో ఉండవేమో! ఈ లైఫ్ లో థ్రిల్ లేదు. ఇందులో భవిష్యత్తు లేదు. తనకేం కావాలో తనకి తెలుసు.... అందుకే యీ తపన. అందుకెంత ఖర్చయినా తను వెనుదీయడు.

ఒక్కగానొక్క కొడుకు కృష్ణ కోసం – తన ప్రాణంలో ప్రాణం – అమరావతి కోసం– తన కోసం – రాబోయే మంచి రోజుల కోసం... ఎన్ని యిబ్బందులయినా ఎదుర్కోక తప్పదు. తన చిరకాల వాంఛ నెర వేర్చు కోవడం కోసం ఎంత మూల్యం చెల్లించడానికయినా

తను సిద్ధమే! హాయిగా నిట్టూర్చేడు రాఘవ. తన కలలు పండే రోజుకింకా పది రోజులుంది... మరో అరగంట క్లినిక్‌లో గడిపి, తరవాత యింటికి బయలు దేరాడు రాఘవ.

### 3

భోజనం చేస్తూ ఉంటే డైనింగ్ టేబిలు పక్కన ఒద్దికగా నిలబడి, టేబిలు అంచు చేత్తో రాస్తూ తన వేపు బెదురుగా చూస్తున్న కృష్ణని గమనించేడు రాఘవ. "వాట్స ద మేటర్ బోయ్?..." లాలనగా అడిగేడు. కృష్ణ గతుక్కు మన్నాడు. చాలా సేపు, చెప్పాలా వద్దా అని సంశయించేడు. చివరికి ధైర్యం కూడ గట్టుకుని, ఆ సాయంత్రం మధుసూదన్ తనతో చెప్పిన దాన్ని మెల్లగా బయట పెట్టేడు. వాడు చెప్పింది విని, రాఘవ నిర్ఘాంత పోయేడు. అమరావతి సంగతి సరే సరి! రాఘవ చేతిలో ముద్ద అలాగే వుండి పోయింది. అతని కన్నా ముందు అమరావతే తేరుకుంది. "బాబీ..." ఆమె గొంతు సన్నగా వణుకుతోంది. ఆమె కళ్ళలో కన్నీటి పొర. "బాబీ!... నువ్వు బ్రైట్ స్టూడెంట్‌వి. నీకిలాంటి ఆలోచనలు రావడం... ఛీ!... నాకసహ్యంగా వుంది... అసలు నీ తలలో అలాంటి భూతాన్ని ప్రవేశ పెట్టిన ఆ రోగ్ ... వాడిననాలి ముందు... బాబీ, వద్దురా! మనకిలాంటి పన్లొద్దు... శ్రద్ధగా చదువుకో! ఆ అడ్డదార్లు, ఆ చీకటి దార్లు వద్దు. నా మాట వినవూ?" రాఘవ సాలోచనగా భార్య ముఖంలోకి చూసాడు. ఆమె ఆందోళననీ, ఆవేశాన్నీ కంట్రోల్ చేసుకోడానికి చేస్తున్న ప్రయత్నం కనిపిస్తూనే ఉంది. రాఘవ ఓ క్షణం కళ్ళు మూసుకుని తెరిచాడు. దృఢంగా నిట్టూర్చేడు. ఆ క్షణంలో అతని తలలో ఏ గిరులు అల్లల్లాడేయో – ఏ సముద్రాలు తిరగబడ్డాయో – తటాలున, కృష్ణ వేపు చూస్తూ అన్నాడు: "సరే, కృష్ణా! నేను మధుసూదన్ ఫాదర్‌తో మాట్లాడుతాను ... నువ్వెళ్ళి చదువుకో" అమరావతి విస్తు పోతూ అతని వేపు చూసింది. రాఘవ అదేం పట్టించుకో లేదు.

"బై ది బై, అమూ డియర్!... మళ్ళీ ఆదివారమే నా ప్రయాణం... ఇవాళే ఉత్తరం వచ్చింది. అన్ని ఏర్పాట్లూ పూర్తయేయి. కొంత కాలం పాటు నీకు తోడుగా వుండేందుకు రమ్మని మీ మమ్మీకీ డాడీకీ ఫోన్ చేస్తాను..." అంటూ తన విదేశీ ప్రయాణం గురించి భార్యతో చెప్పాడు.

తండ్రి మాటలు విన్న కృష్ణ ఆనందానికి అవధులు లేవు. వాడి కళ్ళు మిల మిలా మెరిసి పోయాయి. సంతోషం పట్ట లేక, "థాంక్యూ, డాడీ!" అంటూ, గెంతుకుంటూ తన గది లోకి పరిగెత్తాడు.

### 4

తర్వాత కొన్ని రోజులకి – డాక్టర్ రాఘవ పేర – అతను బొంబాయిలో బస చేసిన హెటల్ అడ్రసుకి ఒక టెలిగ్రాం వచ్చింది. మధుసూదన్ తండ్రి కష్ట పడి సంపాదించి పెట్టిన ప్రశ్నా పత్రాలలో – పరీక్షల్లో అవేవీ రాక, ఆ పరీక్ష కథ, ఆ క్వశ్చన్ పేపర్ల కథ – వొట్టి బూటక మని గ్రహించేక – కళ్ళ ముందు చీకట్లు కమ్ముకుని, ఒంట్లో నీరసం ఆవహించి, మనసు గాట్లు పడి తునా తునకలయి పోయి – పరీక్ష హాల్లో స్పృహ తప్పి పడి పోయి – పరీక్షా పత్రం మీద ఒక్క అక్షరం కూడా పెట్ట లేక – జీవ చైతన్యమంతా

నిస్తేజమై పోగా, తన కలలు చితికి చితికి కూలి పోయి, కాలి పోగా - ఆ సాయంత్రం కృష్ణ శరీరం వేగంగా దూసుకు పోతున్న మైలు బండి చక్రాల కింద, సహస్ర ఖండాలుగా విరజిమ్మ బడి, అతి భయంకరంగా నుగ్గు నుగ్గు అయి పోయిందన్న దుర్వార్తని - ఒకే ఒక్క వాక్యంలో మోసు కొచ్చింది - ఆ టెలిగ్రాం!

ఆ టెలిగ్రాం డాక్టర్ రాఘవకి అందించాలని, అతని రూం తలుపులు తట్టిన హొటల్ బోయ్‌కి - ఆ తలుపులు ఎంతకీ తెరవ బడక పోవడం - ఆశ్చర్యాన్నీ, భయాన్నీ, అనుమానాన్నీ కలిగించింది! గది లోపల - 'బంగారు గుడ్లు పెట్టే బాతుల్లాంటి' దేశాలకి పోయి, తన విజ్ఞానాన్ని రొక్కంగా మార్చుకుని, లక్షల కొద్దీ సంపాదించాలనే ఆరాటంతో బయలు దేరి... వీసా, పాస్ పోర్టూ, అపాయింట్‌మెంట్ ఆర్డరూ... చివరకి ట్రావెలింగ్ ఏజెన్సీ... అన్నీ కూడా మోసం ...మోసం...మోసం! అనే దుస్తరమైన నిజం తెలిసాక - గుండె చిద్రుపలు చిద్రుపలై పోగా... అవమానాన్నీ, ఘోర పరాజయాన్నీ భరించ లేక, నిద్ర మాత్రలు అతిగా మింగి, డాక్టర్ రాఘవ ఆత్మహత్య చేసుకుని మరణించేడనీ... పాపం, ఆ హొటల్ కుర్రాడికేం తెలుస్తుంది?

* * *

సమస్యలకి పరిష్కారం ఆత్మహత్య కాదు - కాని... వికసించి, పరిమళించాల్సిన ప్రసూనాలు, వాడి వత్త లై రాలి పోతున్నట్టుగా -

ఎన్ని... ఎన్ని... ఎన్నెన్ని నిర్భాగ్య జీవితాలు అను నిత్యం కడతేరి పోతున్నాయెంచేత? ఏమో!

* * *

*ఆది వారం వార పత్రిక 10-5- 1981 సంచికలో ప్రచురణ. హిందీ అనువాదం 'సారిక' పక్ష పత్రిక, 1-15 జులై 1984 సంచికలో ప్రచురణ.*

*అనువాదకులు : డా. కె.వి. నరసింహా రావు.*